## కాంగ్రెస్‌కు అభ్యర్థే దొరకడం లేదు



చొప్పదండిలో దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

- ఇప్పుడు ఏదో చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నది
- బండి ఐదేండ్లలో సాధించిందేమీలేదు
- నన్ను గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా
- కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా కొట్లాడి నిధులు తెస్తా
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్

చొప్పదండి, ఏప్రిల్ 17: ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ బురిడీ కొట్టించిందని, వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి చేతులెత్తేసిందని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు రాగానే మళ్లీ ఏదో ఉద్ధరిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నదని, అసలు ఆ పార్టీకి ఎంపీ అభ్యర్థే కరువయ్యాడని ఎద్దేవా చేశారు. ప్రజలు భావోద్వేగాల బుట్టలో పడితే అసలుకే మోసం వస్తుందని హెచ్చరించారు. పనిచేసిందెవరో ఆలోచించి ఓటేయాలని, అభివృద్ధికి చోటివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి చొప్పదండి జడ్పీ స్కూల్ గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా వాకర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఆ తర్వాత చొప్పదండిలో విస్తృత ప్రచారం చేశారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇండ్లు, దుకాణాల్లో కరపత్రాలు పంచుతూ ఓటేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2014 ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా గెలిచిన తర్వాత అనేక అభివృద్ధి పనులను సాధించానని గుర్తు చేశారు. కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్పించి రూ. వెయ్యికోట్లు మంజూరు చేయించానని చెప్పారు. కరీంనగర్ నుంచి సిరిసిల్ల, సిద్దిపేట, హైదరాబాద్ వరకు రైల్వేలైన్ తీసుకువచ్చానన్నారు. మూడు జాతీయ రహదారుల నిర్మాణం, రాజీవ్ రహదారి అభివృద్ధి కోసం అప్పటి కేంద్ర రవాణాశాఖ మంత్రి గడ్కరీకి ప్రతిపాదనలు పంపామన్నారు. దురదృష్టవశాత్తు పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఐదేండ్లు ఎంపీగా పనిచేసిన బండి సంజయ్ పట్టించుకోలేదని ఆరోపించారు. ఆయనకు ప్రజల పక్షాన నిలబడి సమస్యలపై మాట్లాడే అవగాహనలేదని మండిపడ్డారు. ఆయన హయాంలో ప్రజలకు ఒరిగింది గుండు సున్నా అని విమర్శించారు. రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా కనీసం ఒక్క కొత్త జిల్లాకైనా నవోదయ స్కూల్ తెచ్చారా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ దేశంలోని అనేక రాష్ట్రాలకు 150 మెడికల్ కాలేజీలు ఇచ్చారని, ఇందులో ఒక్కటి కూడా తెలంగాణకు ఇవ్వలేదన్నారు. ఇందుకు చొరవ చూపాల్సిన ఆ పార్టీ ఎంపీలు చోద్యంచూశారని విమర్శించారు. కానీ కేసీఆర్ 33 జిల్లాలకు 33 మెడికల్ కాలేజీలు ఇచ్చారని గుర్తుచేశారన్నారు. కొండగట్టును టీటీడీ తరహాలో తీర్చిదిద్దే సంకల్పంతో అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి 330 ఎకరాలను ఎండోమెంట్ శాఖకు అప్పగించేందుకు కృషి చేశానని చెప్పారు. చొప్పదండిని మున్సిపాలిటీగా మార్చి అభివృద్ధి చేశామని, ₹33 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టామని గుర్తుచేశారు. ప్రభుత్వం మారగానే పనులు ఆగిపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే నిలిచిపోయిన సెంట్రల్‌లైటింగ్ పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఒక్కసారి గెలిపిస్తేనే ఎన్నో అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను పార్లమెంట్‌కు పంపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతానని, కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా కొట్లాడి నిధులు తెస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ ఈ సాంబయ్య, మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణ హరి, ఏఎంసీ మాజీ చైర్మన్లు ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, గడ్డం చుక్కారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, కౌన్సిలర్ కొత్తూరు మహేశ్, మాడూరి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు మాచర్ల వినయ్, డాక్టర్ అమిత్, నలుమాచు రామకృష్ణ, గన్ను శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## అల్విన్ ఫ్రిడ్జ్ @ 60 ఏండ్లు

ఇప్పటికీ చెక్కుచెదరని నిజాం కంపెనీ రిఫ్రిజిరేటర్



సాధారణంగా ఒక రిఫ్రిజిరేటర్ పది, పన్నెండేండ్లు మన్నికగా ఉంటుంది. మహా అయితే ఓ పదిహేనేండ్లు పనిచేస్తుంది. కానీ, జగిత్యాలలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ షాపులో ఉన్న ఫ్రిడ్జ్ మాత్రం ఇప్పటికీ చక్కగా పనిచేస్తున్నది. ఒకటికాదు రెండు కాదు అర్ధ శతాబ్దాన్ని పూర్తి చేసుకొని 60వ ఏటకు చేరువవుతున్నది. అయితే ఇది ఎంతో గుర్తింపు పొందిన అల్విన్ కంపెనీ బ్రాండ్ కావడంతో ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నదని మెడికల్ షాప్‌ను ప్రారంభించిన గరిపెల్లి వెంకటరాములు వారసులు చెబుతున్నారు. తమ తండ్రి ఈ ఫ్రిడ్జ్‌ను 1965 ప్రాంతంలో ₹1099కి కొనుగోలు చేశాడని, అప్పటి నుంచి ఇప్పటిదాకా పనిచేస్తూనే ఉన్నదని, ఇంత వరకు రిపేర్ రాలేదని చెబుతున్నారు. ఈ షాప్‌నకు 55 ఏండ్లుగా వస్తున్నానని, ఫ్రిజ్‌ను చూసినప్పుడల్లా ఆశ్చర్యం కలుగుతున్నదని రిటైర్డ్ టీచర్ మ్యాడారం రాములు చెబుతున్నారు. హైదరాబాద్ అల్విన్ లిమిటెడ్ కంపెనీకి ఘనమైన చరిత్ర ఉన్నదని, దీనిని ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1942లో ప్రారంభించారని గుర్తు చేశారు.

- జగిత్యాల, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ)

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న మీకు న్యాయం చేస్తా
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- అంతర్గాం గ్రామంలో పర్యటన



రోడ్డు వెడల్పులో మార్కింగ్ చూస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 17: జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న అంతర్గాం గ్రామస్తులు అధైర్యపడొద్దని అండగా ఉంటానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భరోసా ఇచ్చారు. బుధవారం గ్రామంలో రోడ్డు విస్తరణలో పోతున్న భూములను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అంతర్గాం గ్రామం నుంచే జాతీయ రహదారి 563 వెళ్తున్నదని, ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సర్వే కూడా చేసిందని, గ్రామంలో 45 పైన ఇండ్లు, 100 మంది పైన రైతులు భూమి కోల్పోయే అవకాశం ఉందన్నారు. గ్రామస్తులు బాధపడొద్దని, అధికారులతో మాట్లాడి, న్యాయం చేస్తామని చెప్పారు. కాగా, గ్రామం పక్క నుంచే నేషనల్ హైవే వెళ్తున్నందున ఇక్కడ ఫ్లైఓవర్, అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే మళ్లీ రీ సర్వే రైతులు, ప్రజలకు తక్కువ నష్టం జరిగేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేటి నుంచే నామినేషన్ల పండుగ

నోటిఫికేషన్ విడుదల వెంటే దరఖాస్తుల ప్రక్రియ షురూ

- ఈ నెల 25 దాకా గడువు
- ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల దాకా స్వీకరణ
- కరీంనగర్, పెద్దపల్లి కలెక్టరేట్లలో సెంటర్లు
- పకడ్బందీ ఏర్పాట్లు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు




కరీంనగర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

**పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం నేటి నుంచే మొదలుకాబోతున్నది. ఉదయం 11 గంటలకు నోటిఫికేషన్ రానుండగా, ఆ వెంటే దరఖాస్తుల ప్రక్రియ షురూ కానున్నది. సెలవు రోజులు మినహా ఈ నెల 25 దాకా ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల దాకా స్వీకరించనుండగా, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలకు సంబంధించి ఎన్నికల యంత్రాంగం ఆయా కలెక్టరేట్లలో అన్ని ఏర్పాట్లు చేసింది. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నామినేషన్ల సమయంలో అభ్యర్థులు, వారిని బలపరిచే వారు మినహా ఇతరులెవ్వరిని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోనికి అనుమతించవద్దని ఈసీ స్పష్టం చేస్తున్నది.**



పెద్దపల్లి: కలెక్టరేట్ ఎంట్రీ గేట్ వద్ద ఏర్పాటు చేసిన షామియానా

కరీంనగర్ కలెక్టరేట్/పెద్దపల్లి, ఏప్రిల్ 17: పార్లమెంట్ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఆ వెంటే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుండగా, ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. కరీంనగర్ పార్లమెంట్‌కు సంబంధించి కరీంనగర్ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో.. పెద్దపల్లి లోక్‌సభకు సంబంధించి పెద్దపల్లి కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్ గేట్ నుంచి రిటర్నింగ్ అధికారి చాంబర్ వరకు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా కలెక్టరేట్ గేట్ వద్ద షామియానాలు, టెంట్లు వేశారు. ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను కేటాయించారు. నామినేషన్ సమయంలో సమర్పించాల్సిన పత్రాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయం కోసం నామినేషన్ దాఖలుకు ఒకరోజు ముందే జాతీయ బ్యాంకులో ఖాతా తెరవాలని, నామినేషన్ పత్రాల పరిశీలనకు ముందే అఫిడవిట్ కరెక్షన్లు, డిపాజిట్ సొమ్ము, కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సూచిస్తున్నారు. అభ్యర్థులు తమ నామినేషన్లు సజావుగా దాఖలు చేసేందుకు వీలుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయాల ఎదుట సహాయక కేంద్రం ఏర్పాటు చేశారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థితో పాటు ఆయనను బలపరిచే ఐదుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోనికి అనుమతిస్తారని, అలాగే మూడు వాహనాలకు మాత్రమే లోపలికి పర్మిషన్ ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. మిగతా వారంతా వంద మీటర్ల దూరంలో ఉండాలని సూచిస్తున్నారు. నామినేషన్ల సందర్భంగా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవాలంటే తప్పనిసరి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, కరపత్రాల విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 127ఏ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేస్తున్నారు. నామినేషన్ల సమయంలో సాధారణ ప్రజలను కూడా కలెక్టరేట్‌లోకి అనుమతించకూడదని ఈసీ ఆదేశాలు జారీ చేసిందని చెబుతున్నారు. నామినేషన్ వేసిన నాటి నుంచే అభ్యర్థుల ఖర్చుల లెక్కింపు మొదలవుతుందని, ₹95లక్షలకు మించి ఖర్చు చేయవద్దని, ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొంటున్నారు. అభ్యర్థులు తాము చేస్తున్న ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు నోట్ చేసుకుంటూ, బిల్లులతో సహా జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించాలని, పరిమితిని మించితే వేటు తప్పదని హెచ్చరిస్తున్నారు.

### అన్ని ఏర్పాట్లు చేశాం

**- కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి**

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కోరారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణతోపాటు అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని అభ్యర్థులకు సూచించారు. ఒక్కో అభ్యర్థి ₹95లక్షలకు మించి ఖర్చు చేయవద్దని చెప్పారు.



కమాన్‌పూర్: పెంచికల్‌పేట్‌లో ఎండిపోయిన పంటలో దిగాలుగా కూర్చున్న రైతు ఇరుగురాల పోశం

## అడుగంటిన చి'వరి' ఆశలు

కమాన్‌పూర్, ఏప్రిల్ 17: యాసంగిలో అన్నదాతల ఆశలు అడుగంటుతున్నాయి. ఎక్కడికక్కడ సాగునీరు లేక భూములు నెర్రెలు వారుతున్నాయి. పంటలు చేతికొచ్చే తరుణంలో ఎండిపోతున్నాయి. కమాన్‌పూర్ మండలంలో పరిస్థితి దయనీయంగా మారింది. పదేండ్ల కాలంలో రెండు పంటలు సాగు చేసి మంచి దిగుబడులు తీసిన రైతులు, ఇప్పుడు చుక్క నీటి కోసం తండ్లాడాల్సి వస్తున్నది. పోయినేడు యాసంగితో పోలిస్తే ఈసారి 500 ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గించి.. 6,862 ఎకరాల్లో వరి వేసినా ఫలితం లేకుండా పోతున్నది. ఎస్సారెస్పీ కాలువల నీరు చివరి ఆయకట్టు రాక, చెరువులు, కుంటలు అడుగంటి, భూగర్భజలాలు పాతాళానికి చేరగా.. పంటలకు నీరందని దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతుండగా, రైతులు ఆందోళన చెందుతున్నారు. కాపాడుకునే దారి లేక కన్నీరు పెడుతున్నారు. సర్కారు వైఫల్యం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడుతున్నారు. పెట్టిన పెట్టుబడులు ఎల్లని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

### పెట్టిన పెట్టుబడి రాదు



నేను పదెకరాలు కౌలుకు తీసుకుని వరి వేసిన. అప్పు చేసి మరీ ₹2లక్షల దాకా పెట్టుబడి పెట్టిన. మొదట్లో నీళ్లు మంచిగానే ఉండె. పంట బాగానే ఎదిగింది. ఇక చేతికచ్చే టైం నీళ్లు లేక ఎండిపోతున్నది. శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరే అయింది. పెట్టిన పెట్టుబడిల సగం కూడా అచ్చేటట్టు లేదు. కౌలు ఎలా కట్టాలో తెలుస్తలేదు. అన్నింటికి మునుగుడే అయితంది. సర్కారే ఆదుకోవాలి.

**- ముక్కెర మల్లేశ్, రైతు (జూలపల్లి)**

## భద్రాద్రి సీతమ్మకు సిరిసిల్ల చీర



చీరను సీతమ్మవారికి సమర్పించేందుకు తీసుకెళ్తున్న సీఎస్ శాంతికుమారి, చిత్రంలో హరిప్రసాద్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 17: భద్రాచలం రామాలయంలో బుధవారం జరిగిన సీతారాముల కల్యాణ వేడుకలో సిరిసిల్ల నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ తయారుచేసిన చీర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బంగారు, వెండి, పట్టు జరీతో నేసిన చీరను ఈవో రమాదేవికి హరిప్రసాద్ అందజేశారు. వేదపండితులు కల్యాణంలో సీతమ్మవారికి అలంకరించారు. ఈసందర్భంగా సీఎస్ శాంతికుమారి హరిప్రసాద్‌ను అభినందించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ రెండు గ్రా ముల బంగారం, 150గ్రాముల వెండి, పట్టుదారాలు వినియోగించి 800గ్రాముల బరువుతో చీరను నేసినట్లు తెలిపారు. తాను నేసిన చీర సీతమ్మవారికి అలంకరించడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

## వైభవంగా రాములోరి కల్యాణం



ఇల్లందకుంట ఆలయంలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ దంపతులు



వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శ్రీరామనవమి బుధవారం అంబరాన్నంటింది. ఊరూరా సీతారాముల కల్యాణం జిల్లాలో అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిగా వచ్చిన భక్తుల సమక్షంలో కనుల పండువగా సాగింది. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వేములవాడ, ఇల్లందకుంట రామాలయం, ధర్మపురి నృసింహస్వామి, కొండగట్టు అంజన్న, గోదావరిఖని కోదండ రాముడి ఆలయాలు కిక్కిరిసిపోగా, ఎటు చూసినా సందడి కనిపించింది. ఆయాచోట్ల జరిగిన వేడుకలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. - నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 17





జన సంచారం లేక బోసిపోయిన కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్డు

# నిప్పుల కొలిమి

ఉమ్మడి జిల్లాలో భగ్గుమంటున్న భానుడు

- ఉదయం 9 దాటితేనే ఎండ
- మధ్యాహ్నమైతే సుర్రు సుర్రు
- సాయంత్రం 6 అయినా తగ్గని దగడు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



మధ్యాహ్నం నిర్మానుష్యంగా కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్



సిరిసిల్లలో స్కూలుకు వెళ్లివస్తున్న చిన్నారులు



భానుడు నిప్పుల కొలిమిలా మండుతున్నాడు.. ఉదయం తొమ్మిది దాటితేనే భగ్గుమంటున్నాడు.. మధ్యాహ్నం వేళ తీవ్రరూపం దాల్చుతున్నాడు. రోజురోజుకూ ప్రతాపం చూపిస్తున్నాడు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలదాకా నమోదవుతున్నాయి. బుధవారం కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో 42 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రికార్డు కాగా, ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఫ్యాన్లు, కూలర్లు నడిచినా ఉక్కపోతతో సతమతమయ్యారు.

- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్